క్లుప్తంగా...

డబీల్‌పూర్‌కు ఉత్తమ బీఎంసీ అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గీతారెడ్డి

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి ఉత్తమ బీఎంసీ అవార్డు లభించింది. గ్రామంలో అన్ని పనులు సక్రమంగా నిర్వహిస్తుండటంతో బయో డైవర్సిటీ బోర్డు జిల్లాలో డబీల్‌పూర్ గ్రామాన్ని ఉత్తమ గ్రామంగా ఎంపిక చేసింది. మంగళవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి అధికారుల చేతులమీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ, నాయకులు భాగ్యరెడ్డి, రమోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగతి ఆస్పత్రి సీజ్



రాంపల్లి చౌరస్తాలో జగతి ఆసుపత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డా.పుట్ల శ్రీనివాస్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జగతి ఆస్పత్రిని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సీజ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తమ అధికారుల బృందంతో రాంపల్లి చౌరస్తాలో ఉన్న జగతి ఆస్పత్రికి చేరుకున్న ఆయన ఆస్పత్రి నిర్వహణపై ఫిర్యాదు అందినట్లు తెలియజేశారు. ఆస్పత్రిలో అర్హత కలిగిన వైద్యులు లేకుండానే కొనసాగుతోందని, కొందరు ఫిర్యాదు చేశారని ఈమేరకు విచారణ చేపట్టి ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఆస్పత్రిని సీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లా పరిధిలో సుమారు 1,000 ప్రైవేటు ఆస్పత్రులు కొనసాగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులను నిర్వహిస్తే వాటిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటరు సవరణపై అఖిలపక్ష సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మీ

ఘట్‌కేసర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ విజయలక్ష్మీ మంగళవారం అఖిలపక్ష నాయకులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా సవరణపై నాయకుల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, టీడీపీ మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావు, ఆర్‌ఐ శెర్వాల్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్



మేడ్చల్ మున్సిపాలిటీలో 16వ వార్డులో ..

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మంగళవారం జోరుగా కొనసాగాయి. పట్టణంలోని 4, 16 వార్డుల్లో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి డ్రైవ్ నిర్వహించారు. రెండు వార్డుల్లో కౌన్సిలర్లు గణేష్, ఉమానాగరాజు ప్రారంభించారు. డ్రైవ్‌లో భాగంగా కాలనీల్లో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను శుభ్రం చేశారు. వార్డులో పర్యటించి నాలాలు, మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. వార్డుల్లో డ్రైవ్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. డ్రైవ్‌లో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని 10వ వార్డులో చైర్ పర్సన్ పావనీయాదవ్, 9వ వార్డులో వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీబీ, డ్రోజర్ ద్వారా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగింపజేశారు. కమిషనర్ వేమనరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, ఆంజనేయులు, శశిధర్, సుబ్బారావు, ఆనందర్‌రెడ్డి, సత్యనారాయణ, సిరాజ్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్‌ను చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 16, 17 వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ సురేష్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

చేపపిల్లల రక్షణకు శ్రీకారం

- మండుటెండలతో చనిపోతున్న చేపపిల్లలు
- 227 చెరువుల్లో 64 లక్షల చేపపిల్లల పంపిణీ
- నష్ట నివారణపై మత్స్యకారుల్లో అవగాహన
- సంరక్షణపై అవగాహన కల్పించేందుకు రెడీ



సాక్షి, మేడ్చల్ జిల్లా: వాతావరణ పరిస్థితుల్లో అనూహ్యమైన మార్పుల కారణంగా వేసవి ప్రారంభం ముందు నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో చేపల పెంపకం, ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సహజసిద్ధమైన జలాశయాలు, చెరువులు/కుంటల్లో చేపల పెంపకం సాగుతోంది. జలాశయాల్లో వివిధ కారణాల వల్ల నీటి మట్టం క్రమేపీ తగ్గడం.. వేసవి ముగిసే వరకు నీరు కొత్తగా చేరే అవకాశం లేకపోవడం వంటి పరిస్థితుల్లో నీటి వనరులలో ఉన్న చేపల సంరక్షణపై నిశిత పరిశీలన, తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ఆకస్మికంగా చేపలు చనిపోయే ప్రమాదముందని తెలుస్తోంది. దీన్ని నివారించి, ఆర్థిక నష్టం కలగకుండా జాగ్రత్తలపై గంగపుత్రులు, చేపల పెంపకందారులు, మత్స్యకారుల్లో అవగాహన చర్యలకు జిల్లా మత్స్యశాఖ శ్రీకారం చుడుతోంది.

227 చెరువుల్లో 64 లక్షల చేప పిల్లలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ సీజన్‌లో 227 చెరువులు/కుంటల్లో 64 లక్షల చేప పిల్లలను ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేశారు. ఈ చేప పిల్లల్లో 80-100 ఎంఎం రకం చేపపిల్లలను 8,89,700, కాగా, 35-40 ఎంఎం రకం చేపపిల్లలు 55,03,300 ఉన్నాయి. చెరువులు/కుంటల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని అక్టోబర్ వరకు పూర్తి చేయాల్సి ఉండగా, టెండర్ల జాప్యంతో పాటు కాంట్రాక్టర్ల తప్పిదం, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా కారణంగా డిసెంబర్ వరకు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్లు మేడ్చల్ జిల్లాకు దిగుమతి చేసిన చేప పిల్లల సైజు తక్కువగా ఉండటంతో పాటు ప్యాకెట్‌లో 1000 బదులు 800 మాత్రమే ఉండటం వల్ల చెరువుల్లో పంపిణీ చేసేటప్పుడు మత్స్యకారులు, గంగపుత్రులు వాటిని గుర్తించి ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో నిర్లక్ష్యంతో నిద్రమత్తులో ఉన్న మత్స్యశాఖ జిల్లా అధికారులు కళ్లు తెరిచి వాటిని వెనక్కి పంపించారు. ఫలితంగా చేపపిల్లల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో చేపపిల్లల ఎదుగుదలకు ఆలస్యం జరుగుతోంది.

మండుతున్న ఎండలతో..

చెరువులు/కుంటలు, సహజ వనరుల్లో అధిక సాంద్రత, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల వల్ల రోగకారక సూక్ష్మక్రిముల బారినపడి చేపలు ఆకస్మికంగా చనిపోతున్నట్లు తెలుస్తోంది. గతేడాది, అంతకు ముందు సంవత్సరంలో మేడ్చల్ జిల్లాలో శామీర్‌పేట్, కీసర మండలాల్లోని పలు చెరువులు/ కుంటల్లో పంపిణీ చేసిన చేప పిల్లలు ఎండ వేడిమితోపాటు పలు కారణాల వల్ల చనిపోయిన దాఖలాలు ఉన్నాయి. ఈ ఏడాది కూడా అధిక ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో చేప పిల్లల సంరక్షణపై మత్స్యకారులు/రైతులు సూచించిన యాజమాన్య పద్ధతులు ముందస్తుగా అవలంభిస్తే చేపలు చనిపోయే పరిస్థితి నుంచి తప్పించి ఎలాంటి నష్టం కలగకుండా నివారించవచ్చని జిల్లా మత్స్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, గంగపుత్రులు, మత్స్యకారులు, పెంపకం దారుల్లో అవగాహన కార్యక్రమాలను ప్రాంతాలు, బస్తీలు, చెరువుల వారీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ తెలిపారు.

చేపల సంరక్షణపై జాగ్రత్తలు ఇవే..

- చెరువుల్లోని నీటి నాణ్యత, లోతు, విస్తీర్ణం అనుసరించి ప్రతిరోజూ చేపల కదలికలు గమనించాలి. ఉదయం సమయంలో చేపలు చెరువుపైభాగాన నోరు తెరచుకొని తిరుగుతూ ఉంటే ప్రాణవాయువు కొరత ఉందని గమనించాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో చెరువులో నీరు పెట్టడం, అది సాధ్యం కాకపోతే పెద్దగా పెరిగిన చేపలను పట్టి విక్రయించాలి. దీని వల్ల చేపల సాంద్రత తగ్గి ప్రాణవాయువు కొరతను అధిగమించేందుకు అవకాశం ఉంటుంది.
- చెరువులోని నీటి నాణ్యత తగ్గిపోయినప్పుడు చెరువుల్లో ఒక హెక్టారుకు 100 నుంచి 250 కేజీల సున్నం చల్లితే నీటి నాణ్యత పెరగడమే కాకుండా ప్రాణవాయువు శాతం పెరుగుతుంది.
- చెరువులోని కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తగ్గిస్తూ ఉండాలి. లేదంటే రాత్రి సమయాల్లో అవి కేవలం కార్బన్ డయాక్సైడ్ విడుదల చేయడం వల్ల నీటిలో ప్రాణవాయువు కొరత ఏర్పడి ఎక్కువ మొత్తంలో చేపలు చనిపోతాయి.
- చేపలు చనిపోయినప్పుడు వెంటనే వాటిని తొలగించి చెరువుకు దూరంగా కాల్చేయాలి. లేదా ఒక గోతి తీసి అందులో పూడ్చేయాలి. లేదంటే నీరు కలుషితమై చెరువులోని చేపల సంపద మొత్తం చనిపోయే పరిస్థితులకు దారితీస్తుంది.
- నీటి నాణ్యత పెంచే రసాయనాలు బెంజాల్ కోలియం క్లోరైడ్‌ను ఒక హెక్టారుకు ఒక లీటరు చొప్పున నీటిలో కలిపి చెరువులో చల్లాలి. దీంతో నీటి నాణ్యత పెరగడమే కాకుండా చేపలపై ఉన్న పరాన్న జీవులు చనిపోతాయి. తదుపరి కూడా ఎలాంటి మార్పు లేకపోతే చివరి అస్త్రంగా యాంటీ బయోటిక్ మందులను సూచించిన మోతాదులో మేతతో పాటు కలిపి ఇవ్వాల్సి ఉంటుంది.
- ప్రాణవాయువు పెంచేందుకు చెరువులోని నీటిని మోటార్ల ద్వారా రీసైక్లింగ్ చేస్తే విష వాయువులు తగ్గి ప్రాణవాయువు శాతం పెరుగుతుంది.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



ఘనాపూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న వజ్రేశ్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కుల మత, వర్గ విబేదాలు లేని దేశం కోసమే హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఘనాపూర్‌లో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఘనాపూర్, ఇందిరానగర్, పకీర్‌టిక్యాలో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని, సంక్షేమ పాలన కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. జోడో యాత్రలో ఘనాపూర్ టీ పీసీసీ మహిళ కార్యదర్శి ఎస్.అనిత, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పోచారం మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు మమతగౌడ్, రూప్‌సింగ్, గోవర్ధన్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ సత్తయ్యగౌడ్, నాథంగౌడ్, బి.అనిత, సురేశ్, శివాజీ, మహేశ్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ కొరడా



జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నూతనంగా వెలసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం పోలీసు బందోబస్తు నడుమ తొలగించారు. ఈ సందర్భంగా కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరికలు జారీ చేసినా కొందరు కబ్జాదారులు పట్టించుకోవడంలేదన్నారు. అనుమతులు లేకుండా వేసిన పలు బోర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. మరోమారు నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. న్యూట్రిషన్ కిట్లకు సంబంధించిన పరికరాల నాణ్యతను ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గర్భిణులు అధిక సమయం వేచిచూడకుండా త్వరగా కార్యక్రమాన్ని జరిగేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మరో 15 రోజుల పాటు తీవ్రమైన ఎండలు ఉంటాయని, ఎండల కారణంగా వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా అవసరమైన సూచనలు సలహాలు అందజేయాలన్నారు. ఉపాధి హామీ కార్మికులు పనిచేసే సమయంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

వైద్యాధికారుల సమావేశానికి ముందు కలెక్టర్ అమయ్‌కుమార్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, రాష్ట్రస్థాయి వైద్యశాఖ ఉన్నత అధికారులతో జిల్లాలో చేపడుతున్న వైద్యసేవలపై మాట్లాడారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు మాట్లాడుతూ.. గర్భిణుల్లో అనిమియా సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ప్రారంభిస్తునట్లు మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

974 ఆశ వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీలలో ఖాళీగా ఉన్న 974 ఆశ వర్కర్ల పోస్టులను భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ కింద ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశ వర్కర్‌గా పని చేయడానికి అభ్యర్థులు కనీసం 10వ తరగతిలో ఉత్తీర్ణత ఉండాలన్నారు. 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు అర్హులన్నారు. సంబంధిత అభ్యర్థులు జీహెచ్‌ఎంసీలోని పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీ పరిధిల్లోని బస్తీల్లో నివసించే వారై ఉండాలన్నారు. స్థానిక భాషలో అనర్గళంగా మాట్లాడాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 27 వరకు ప్రతి రోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విత్తనాల తయారీ కేంద్రంలో తనిఖీలు

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలోని ఎల్లోరడో అగ్రిటెక్ విత్తనాల తయారీ కేంద్రంలో మంగళవారం సీడ్ టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ టీమ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బీటీ పత్తి విత్తనాల నాణ్యత, పత్తి విత్తనాలు నకిలీవా..? అని తనిఖీ చేశారు. విత్తనాలను టెస్ట్ చేయగా నాణ్యమైన వాటినే తయారు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏడీఏ సుధాకర్‌బాబు, ఎస్‌ఓటీ పోలీస్ జెమ్స్ బాబు, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ మహేష్ బాబు, జిల్లా అగ్రికల్చర్ అధికారి సుధారాణి, ఎండీ లింగ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

జవహర్‌నగర్: అప్పుల బాధతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ సీతారాం వివరాల ప్రకారం .. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని విఘ్నేశ్వరకాలనీలో నివసించే నారాయణ(33) భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. చీపురుకట్టలు అమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణ విషయంలో అప్పులు కావడంతో కొంత కాలంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందాను.. నేను ఆత్మహత్య చేసుకుంటానని తన సోదరుడికి వాట్సాప్ మెస్సేజ్ చేశాడు. మంగళవారం ఉదయం చెన్నాపురం చెరువుకట్ట సమీపంలో ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండిళ్లలో చోరీ



నవీన్‌చారి ఇంట్లో..

ఘట్‌కేసర్: రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌదరిగూడ వెంకటాసాయి నగర్ ఫేజ్-1లో నివాసముండే నవీన్‌చారి కుటుంబం ఆదివారం, కనకయ్య కుటుంబ సభ్యులతో కలిసి శనివారం బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, కోతులు తిరుగుతున్నాయని సోమవారం ఇంటి పక్కన వారు సమాచారం ఇవ్వడంతో ఇంటికి వచ్చారు. తలుపులు పగులగొట్టి ఉన్నాయి. అల్మారాలోని నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు చెప్పారు. నవీన్‌చారి ఇంట్లో 7 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదు, కనకయ్య ఇంట్లో ఫోన్, రూ.15 వేల నగదు, 5 గ్రాముల బంగారం, 5 తులాల వెండి ఎత్తుకెళ్లారు. రెండిళ్లలోనూ దొంగలు గేటు దూకి ఇంటి తాళం పగులగొట్టారు. పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

జవహర్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మల్కాజిగిరి ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ నుంచి రమణబాబు గంజాయి తీసుకువచ్చి బీజేఆర్‌నగర్‌కు చెందిన రాహుల్‌తో కలిసి స్థానిక యువతకు గంజాయిని అలవాటు చేస్తూ విక్రయిస్తుండేవారు. జవహర్‌నగర్ చెన్నాపురం చెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 4.2 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన నేతలు



కీసర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను మంగళవారం మంత్రి మల్లారెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపాలిటీ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులను ప్రత్యేకంగా మంజూరు చేయాలని కోరారు. నాగారం మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్త



మాట్లాడుతున్న చౌదరిగూడ సర్పంచ్ రమాదేవి

ఘట్‌కేసర్: రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రమాదేవి ఆదేశించారు. చౌదరిగూడ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన మంగళవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై చర్చించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి 14 శాతం రుసుముతో తీసుకొని నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకునేందుకు పంచాయతీ కార్యాలయం నుంచి అనుమతులు ఇవ్వాలని తీర్మానించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, వార్డు సభ్యులు భోజిరెడ్డి, స్వామిదాస్, సుధాకర్, లక్ష్మణ్, శంకర్‌గౌడ్, సంయుక్త, స్వాతి, స్వాతి, కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.

ఇళ్లను క్రమబద్ధీకరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఇళ్లను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ అమయ్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈడబ్ల్యూఎస్ కాలనీలో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి, అలాగే 1976-77లో 18.23 ఎకరాల్లో ప్రభుత్వం భూమి పట్టాలు ఇచ్చి ఏపీ కార్పొరేషన్ ద్వారా ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు 59 ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని లేఖలో పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ మల్లేశ్, జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శశిధరన్, నాయకులు విజయ్‌ముదిరాజ్, నజీర్ పాల్గొన్నారు.

రాజీనామాపై విచారణ



మునీరాబాద్ పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న ఎంపీఓ రవినాయక్

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలో మంగళవారం మేడ్చల్ ఎంపీఓ రవినాయక్ విచారణ జరిపారు. గ్రామ కార్యదర్శి ఏ పని చేయాలన్నా డబ్బులు తీసుకుంటోందని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గ్రామ సర్పంచ్ గణేశ్, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు తమ పదవులకు సోమవారం రాజీనామా చేయడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎంపీఓ రవినాయక్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. పలు రికార్డులను పరిశీలించారు. విచారణకు గ్రామ సర్పంచ్ హాజరుకాకపోవడంతో గ్రామ కార్యదర్శి ప్రమీలాదేవి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నట్లు ఎంపీఓ తెలిపారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని వివరించారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాలకవర్గ సభ్యులు పాల్గొనగా మున్సిపాలిటీలో చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో విద్యుత్ శాఖ తీరు పట్ల పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు, అధికారులు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాలకవర్గ సభ్యులు

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

జవహర్‌నగర్ మేయర్ కావ్య



జవహర్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో సమావేశం

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జన ఆరోగ్య సమితి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ మేకల కావ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు పనిచేస్తున్నాయన్నారు. జవహర్‌నగర్ పరిధిలో బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీ సబ్ సెంటర్లలో నెలకొన్న పారిశుద్ధ్య, డ్రైనేజీ, నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పలు సమస్యలపై జన ఆరోగ్య సమితి కమిటీ సభ్యులతో వారు చర్చించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుష్మ, పబ్లిక్ హెల్త్ ఏఈ రాజశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి షౌకత్ అలీ, జన ఆరోగ్య సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మంత్రి మల్లారెడ్డితో దమ్మాయిగూడ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కౌకుట్ల మల్లారెడ్డి తదితరులు

కీసర: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ నేతలు కృషిచేయాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడిగా అహ్మద్‌గూడకు చెందిన కౌకుట్ల మల్లారెడ్డికి మంత్రి మల్లారెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, నానునాయక్, వెంకటేష్, నాగయపల్లి సుజాతశ్రీనివాస్, స్వప్న హరిగౌడ్, కొత్త హేమలత శ్రీనివాస్‌గౌడ్, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుడు మణికంఠ, నర్సింహగౌడ్, కిరణ్‌గుప్తా, మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.